# తీరు

రాత్రి తొమ్మిది దాటింది. వార్తల ముఖ్యాంశాలు విని టి.వి. కట్టేసి బాల్కనీలోకి వచ్చి పడక కుర్చీలో కూర్చుని సిగరెట్ పెట్టె తెరిచాను. ఒక్కటే ఉంది. తీసి ముట్టించాను. మా ఇంటి కిందకువెళ్ళి సిగరెట్లు తెచ్చుకోవాలి. తొమ్మిదిన్నర దాటితే బడ్డీకొట్టు మూసేస్తాడు. తోటలోని చెట్లమీంచి చల్లటిగాలి వీస్తోంది. సాయంత్రాలు బాల్కనీలో ఎంతసేపు కూర్చున్నా నాకు విసుగు అనిపించదు. అలాకూర్చునే చాలాసార్లు నిద్రపోయాను.

సిగరెట్ తాగడం ముగించి సిగరెట్ పీక కుర్చీకిందున్న యాష్ట్రే లో కుక్కి లేద్దామనుకునేంతలో చొక్కా జేబులోని సెల్‌ఫోను మోగింది. బయటకు తీశాను. వచ్చిన నెంబరు కొత్తది. ఎవరో అనుకుంటూ, "చెప్పండి" అన్నాను.

"ఎవరు మాట్లాడుతోంది?"

"మీకు ఎవరు కావాలండీ?"

"మాట్లాడుతోంది ఎవరో తెలుసుకోవచ్చా?"

నాకుతెలిసిన వాళ్లెవరో నన్ను ఆటపట్టించడానికి అలా అడుగుతున్నారని ముందు అనిపించింది. ఫోను చేసినతని కంఠస్వరం కొత్తగా ఉంది. మునుపు ఎప్పుడూ వినలేదు. సెల్ కట్టేద్దామనుకునేంతలో అతనే నా సెల్‌నంబరు చెప్పి, "మీరు ఏమనుకోకండి. ఈ సెల్ మీదే కదూ?" అడిగాడు.

ఎందుకలా అడిగాడో నాకు అర్థం కాలేదు. నవ్వి, "అవును" అన్నాను.

"మీపేరు తెలుసుకోవచ్చా?"

"ఎందుకు?" విసుగ్గా అన్నాను.

"దయచేసి కోపం తెచ్చుకోవద్దు. నేను వనస్థలిపురం నుండి మాట్లాడుతున్నాను. నా పేరు జయరాం. మాదాపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా వయసు నలభయి

సంవత్సరాలు...." ఆగాడు. ఏదోచెప్పడానికి తటపటాయిస్తున్నట్టుగా అనిపించింది.

"మీకు కావలిసింది ఖచ్చితంగా ఈనెంబరేనా?"

"అవును. మీరెక్కడ పనిచేస్తున్నారు?"

అతనెవరో నాకు తెలియదు. అతని గురించి నాకూ ఏమీ తెలియదు. అతనికి నా గురించి ఎందుకు చెప్పాలనిపించింది. అతని పేరు నిజంగా జయరామో, అతను తన గురించి చెప్పినవి ఎంతమాత్రం నిజమో నాకు తెలియవు. ఏదో చెప్పబోతున్నాడు. వినాలనిపించింది.

నా పేరు సభాపతి అని, నేనెక్కడ ఉద్యోగం చేస్తున్నానో చెప్పాను. రెండూ నిజాలు కావు.

"నాకో బాబు... ఎనిమిది చదువుతున్నాడు. నా భార్య... " రెండుక్షణాలు ఆగి, "మాది ప్రేమవివాహం..." అంటోంటే అతని మాటలకు అడ్డు తగులుతూ, "ఈ సంగతులు మీరు నాకు ఎందుకు చెబుతున్నారో అర్థం కావడం లేదు" అన్నాను.

జయరాం పేరు నేనెవరి నోటో విన్న గుర్తు. ఎవరి నోట విన్నానో గుర్తు రావడం లేదు.

"రెండు నిమిషాలు ఓపిక పట్టండి, మీకు అన్ని విషయాలు చెబుతాను. మీకెంతమంది పిల్లలు?"

వెంటనే జవాబు చెప్పలేదు.

"మీకు పెళ్ళికాలేదా?" అడిగాడు.

ఒక్కో ప్రశ్నవేస్తూ నన్ను ఎక్కడకు తీసుకు వెళ్తున్నాడో నాకు అర్థం కావడం లేదు.

"మీరు ఎక్కడ ఉంటున్నారు?" అడిగాడు.

ఆఫీసులో నాది లావాదేవీల కుర్చీ. నా కాళ్లకిందకు నీళ్ళు ఎప్పుడు వస్తాయో నాకే తెలియదు. ఉధృతంగా వస్తే నన్ను ఎవరూ ఆదుకోరని నాకు తెలుసు. కొట్టుకుపోతాను.

నామీద విచారణ లాటిదేమయినా మొదలయి ఉంటే నా గురించిన వివరాలన్నీ జయరాం ఈ పాటికే తెలుసుకుని ఉండాలి. నాకు హింట్ ఇచ్చే విధంగా అడగడం ఎందుకు? సెల్ ఆపేస్తే నా మీద అనుమానం ఎక్కువ చేసుకున్న వాడినవుతాను. తప్పులు చేయనని కాదు. తెలియక కొన్ని, తెలిసికొన్ని దొర్లుతుంటాయి.

"విద్యానగర్‌లో ఉంటున్నాను" అన్నాను.

"విద్యానగర్‌లో ఎక్కడ?"

"అడిక్‌మెట్‌లో".

"ఎక్కడ పనిచేస్తున్నారు?"

"పనిచేయడం లేదు."

"అదేమిటి?"

"కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేసి నాలుగు సంవత్సరాల కిందట పదవీ విరమణ చేశాను. ఇప్పుడు నా వయసు అరవయి నాలుగు సంవత్సరాలు. పన్నెండు సంవత్సరాల కిందట నా భార్య చనిపోయింది. నాకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్లిళ్ళు అయిపోయాయి. పెద్దమ్మాయి బెంగుళూరులో, చిన్నమ్మాయి అమెరికాలో ఉంటున్నారు. అదృష్టవశాత్తూ కొడుకులు లేరు. నేనొక్కడినే ఉంటున్నాను.."

నా మాటలు జయరాంను ఆశ్చర్యంలోకి నెట్టేసి ఉండాలి. వెంటనే వేరే ప్రశ్న రాలేదు. నా గురించి అతను ఇంకోవిధంగా ఊహించుకుని ఉండాలి. నన్ను అర్థం చేసుకోడానికి మా నాన్నకు నలభయి సంవత్సరాలు పట్టింది.

"మీ స్వరం వింటోంటే మీకంత వయసుంటుందని నమ్మలేకపోతున్నాను. ఎవరూ అనుకోరు."

"ఇంతకూ మీరు నాకు ఎందుకు ఫోను చేశారో చెప్పలేదు."

"నాభార్య పేరు అనురాధ. ఆమె పోస్టుపెయిడ్ సెల్ బిల్లులు నేను ఎప్పుడూ చూడను. చూసే అలవాటు లేదు. తనే కట్టుకుంటుంది. ఈ సాయంత్రం ఆమె ఇంట్లోలేకపోవడం వలన కొరియర్ అతను సెల్‌బిల్లు నాకిచ్చాడు. బిల్లు డబ్బు ఎక్కువగా ఉంటే ఎందుకంత అయిందా అని చూస్తే ఎక్కువ కాల్స్ మీ సెల్‌కే ఉన్నాయి. పోయిన నెల ఆరోతేదీ రాత్రి పదకొండు నుండి ఒంటిగంటన్నర వరకు మీ నెంబరుకు కాల్ చేసినట్టుగా ఉంది. ఆమె సెల్ నుండి మీసెల్‌కి అన్ని కాల్స్ ఎందుకు వస్తున్నాయో నాకు తెలుసుకోవాలనిపించింది. నిజం చెప్పాలంటే బాధగా ఉంది. అనురాధ మీకు బాగాతెలుసా? గంటల తరబడి మాట్లాడుకునే పరిచయం మీకుందా?" నిలదీసి నన్ను అడుగుతున్నట్టు లేకపోయినా బాధ జీర ధ్వనించింది.

"నా వయసు ఎంతో మీకు చెప్పాను. మహా అయితే అనురాధ గారికి ముప్పయి అయిదు సంవత్సరాలు మించి ఉండకపోవచ్చు. ఏ సంబంధం ఊహించుకోడానికి ఆస్కారం లేనేలేదు. నా చిరునామా ఇస్తాను. మీరు నా ఇంటికి వచ్చి నిజానిజాలు మీ అంతట మీరే తెలుసుకోండి. ఇంకో సంగతి. పోయిన నెల

రెండో తేదీనుండి పదిహేనో తేదీ వరకు నేనీ ఊళ్ళోలేను. బెంగుళూరులో ఉంటున్న మా పెద్దమ్మాయి దగ్గరున్నాను. మీ సెల్‌కు రోమింగ్ ఉంటే బిల్లులో ఊరునంబరు కూడా ఉంటుంది. ఒకసారి చూడండి."

జయరాం చేతిలో బిల్లు ఉందనుకుంటాను. చూస్తూ ఉండాలి. వెంటనే సమాధానం రాలేదు. మూడుక్షణాలు ఆగి, "చూశారా?" అడిగాను.

"హైదరాబాద్ అనే ఉంది".

"కంప్యూటర్ బిల్లు అయినా అప్పుడప్పుడు తప్పులు జరుగుతుంటాయి. వాళ్ళకు ఇరవయి నాలుగు గంటల కస్టమర్ సర్వీసు ఉంటుంది. ఈవిషయం వాళ్ళ దృష్టికి తీసుకెళ్ళి దులిపేయండి. ఊరుకోవద్దు. సెల్ మీ పేరు మీద ఉందా, అనురాధ గారి పేరు మీద ఉందా?"

"ఆమె పేరు మీదే ఉంది."

"ఆమె చేతే అడిగించండి."

జయరాం తేలికగా ఊపిరి వదిలి ఉంటాడు. "మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టాను క్షమించండి" మాటలు ఇందాకటంత బరువుగా లేవు.

"అంత పెద్ద మాట అనకండి. ఉంటాను". అని సెల్ కట్టేసి తేలికగా గాలి పీల్చుకున్నాను.

సెల్ చార్జిలో పెట్టి చెప్పులు తొడుక్కుని తలుపు దగ్గరగా వేసి బయటకు వచ్చాను. తొమ్మిదిన్నర కావస్తున్నా బడ్డీకొట్టు తెరిచే ఉంది. సిగరెట్ పేకట్ కొని ఒకటి తీసి వెలిగించాను.

జయరాంతో మాట్లాడుతోంటే నా బుర్ర వేడెక్కిపోతున్నా కూల్‌గానే మాట్లాడాను. అతనెంత బాధకు లోనయి ఉండుంటాడో నేను ఊహించగలను. పగటివేళలో అనురాధకు తెలియకుండా వాళ్ల పనిమనిషి తనకు తెలిసిన వాళ్ళెవరితోనో అంతసేపు మాట్లాడి ఉండొచ్చు అనుకోడానికి అది రాత్రి పూట. పనిమనిషి మాట్లాడే అవకాశం లేదు. పగలు కాని రాత్రి కాని అంతసేపు మాట్లాడడం ఎన్నో అనుమానాలకు దారి తీస్తుంది. నా మాటలు జయరాం అనుమానాలను తగ్గించాయో, లేదో? సిగరెట్ తాగడం ముగించే వరకు కొట్టుముందున్న బల్లమీదే కూర్చున్నాను.

ఇంట్లోకి వచ్చి చెప్పులు గోడవారగా పెట్టి నా భార్య జయలక్ష్మి వంక చూశాను. టి.వి. ఆర్పేసి ఉంది. గది నిశ్శబ్దంగా ఉంది. పక్కగదిలో పిల్లలు నిద్రపోతున్నట్లుంది. మామూలుగా ఆ సమయంలో నా భార్య ఏ టి.వి. సీరియల్‌లో చూస్తూ ఉంటుంది.

ఆమెచేతిలో ఉంది టి.వి. రిమోట్ అనుకున్నాను. కాదు. నా సెల్‌ఫోను. జయలక్ష్మి కూర్చుని ఉన్న సోఫా ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చోగానే సెల్ సోఫాలో పడేలా విసిరి, "ఎవరో జయరాం అట, మీరు ఇందాక బయటకు వెళ్ళిన దగ్గరనుండి మీరిప్పుడు ఇంట్లోకి వచ్చేవరకు నాతో మాట్లాడాడు. మీ గురించి, నా గురించి, పిల్లల గురించి, మీరు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తోందీ, ఎక్కడి ఉంటుందీ దాదాపు అన్ని సంగతులూ అడిగాడు. ముందు చెప్పకూడదనుకున్నాను కాని తను మీ చిన్ననాటి స్నేహితుడనని, దుబాయ్‌లోఉంటూ చాలా సంవత్సరాల తర్వాత ఈ సాయంత్రం హైదరాబాద్ వచ్చానని చెప్పేసరికి అన్నీ చెప్పాను..." అంటూ నా ముఖంలోకి పరీక్షగాచూసింది. ఆమె చూపులు, మాటలు నాకు కొత్తగా అనిపించాయి. మునుపు ఎప్పుడూ నన్నలా చూడలేదు. అలా మాట్లాడలేదు. నేనో కొత్త వ్యక్తిలా ఆమెకు అనిపిస్తున్నానా?లేక నా ఆలోచనలో మార్పా? ఆమె మాటలకు నా గుండెలో రాయిపడిన మాట నిజం.

అనురాధ నాకు చెప్పినంత అమాయకుడిలా జయరాం అనిపించడం లేదు. అతను మళ్లీ నా సెల్‌కు ఫోను చేస్తాడని నేను ఊహించి ఉంటే సిగరెట్ పెట్టె కొనుక్కోడానికి బయటకు వెళ్ళినప్పుడు సెల్ నాతోపాటు తీసుకు వెళ్ళి ఉండేవాడిని. తీసుకు వెళ్ళకుండా పెద్ద పొరపాటే చేశాను. జయలక్ష్మికి నా గురించి చాలా విషయాలు తెలియవు. నేను మంచి వ్యక్తినని ఆమె అనుకుంటున్న దానికి జయరాం గండి కొట్టాడా? అతను ఇంకా ఏమేమి అడిగాడని నేనడిగితే మరికొన్ని అనుమానాలకు తావిచ్చిన వాడినవుతాను. అనురాధ వాళ్ళింట్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలనిపిస్తోంది. ఆమె సెల్ ఆమె దగ్గరుందో, అతని దగ్గరుందో? జయరాం మళ్ళీ నాకుతప్పకుండా ఫోను చేస్తాడు. ఈసారి ఊరుకుంటాడని అనుకోను. సెల్ కట్టేశాను.

❖ ఆదివారం వార్త, 25 మే 2008